మహేష్‌కుమార్ గౌడ్‌కు సన్మానం



సన్మానిస్తున్న సుధీర్‌కుమార్ తివారీ, కన్నయ్యలాల్ తదితరులు

అబిడ్స్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తి చేయడంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధీర్‌కుమార్ తివారీ, కన్నయ్యలాల్, వికాస్ శ్రీవాస్తవ్ తదితరులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

వాసవీ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు రూ.10 లక్షల జరిమానా


నాంపల్లి: వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైన ఘటనలో వినియోగదారుల ఫోరం లక్డీకాపూల్‌లోని వాసవీ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు రూ.10 లక్షల జరిమానా విధించింది. మాతృ వియోగంతో మానసిక వేదన పొందిన ఎలిగేటి శారద(76) కుమారుడు, ప్రసిద్ధ కళాకారుడు, మాసబ్‌ట్యాంక్ నివాసి రాజేష్ తనకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. విచారణ పూర్తి చేసిన పిదప వైద్యుల నిర్లక్ష్యం జరిగిందంటూ ఫోరం నిర్ధారించింది. బాధితుడికి రూ.10 లక్షలు చెల్లించాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు బాధితుడు సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తన గోడును వెల్లబోసుకున్నారు. యాంజియోగ్రామ్ పరీక్ష కోసం తన తల్లి ఎగిగేటి శారదను లక్డీకాపూల్‌లోని వాసవీ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు తీసుకెళ్లినట్లు బాధితుడు రాజేష్ పేర్కొన్నారు. అక్కడి వైద్యులు నిర్లక్ష్యం కారణంగా తన తల్లి శారద చనిపోయిందని పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్



అఫ్జల్‌గంజ్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆనంద్ కుమార్ గౌడ్‌ను కలిశారు. సోమవారం బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో కేటీఆర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. త్వరలోనే మంచిరోజులు వస్తాయన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజా సంక్షేమం, ప్రజాభివృద్ధి కొనసాగిందన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



గన్‌ఫౌండ్రీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా తన విస్తృత నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా జనరల్ మేనేజర్ శ్రీవాత్సవ్ తెలిపారు. సోమవారం రవీంద్రభారతిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా 120వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..12 దశాబ్దాలుగా వినియోగదారుల విశ్వాసం, సేవలతో పాటు దేశ నిర్మాణంలో గొప్ప వారసత్వాన్ని పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు బ్యాంక్ ఉద్యోగుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షులు జి.నాగేశ్వర్ పాల్గొన్నారు.

బుల్లెట్టు బండి సరే.. హెల్మెట్ ఏదండీ?



చార్మినార్: ఈ నెల 6న పాతబస్తీలో జరిగిన వినాయక నిమజ్జనోత్సవాన్ని పోలీసు అధికారులు పర్యవేక్షించారు. ఈ క్రమంలో బుల్లెట్‌పై ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, అదనపు డీసీపీ మాజిద్ వెళ్లారు. అయితే ఇద్దరు పోలీసు అధికారులు మాత్రం హెల్మెట్ పెట్టుకోవడం మరిచారు. రూల్స్.. సామాన్యులకేనా.. పోలీసులకు వర్తించవా అని స్థానికులు గుసగుసలాడుకున్నారు.



చెత్త, వ్యర్థాలతో విరాట్ నగర్ కుంట నాలా



రోడ్డుపై పడి ఉన్న నాలా ఫెన్సింగ్

ఏమ‘నాలా’..?

- నాలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఫెన్సింగ్ లేని నాలాలతో ప్రమాదాలు
- వర్షం పడితే పొంగిపొర్లుతున్న నాలాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

గోల్కొండ: నాలాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. చెత్త, వ్యర్థాలతో నిండి ఉన్న నాలాలు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. చిన్న చినుకు పడితే పలు ప్రాంతాలలో నాలాలు పొంగిపొర్లుతున్నాయి. నాలాలకు ఉన్న ఫెన్సింగ్ ధ్వంసమై నెలలు గడుస్తున్నా కొత్త ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం లేదు. ఫెన్సింగ్ లేని నాలాలు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఫెన్సింగ్ లేకపోవడంతో నాలాల పరిసరాల్లో ఉండే వారితో పాటు చెత్తను ఏరే రిక్షా కార్మికులు చెత్తను, వ్యర్థాలను నాలాలో డంపింగ్ చేస్తున్నారు. చినుకు పడితే నాలాలు పొంగిపొర్లుతున్నాయి. నాలాలో నిండుగా వ్యర్థాలు ఉండడంతో నాలాలో నీరు ఒక్క అంగులం కూడా ముందుకు కదలడం లేదు.

వ్యాపిస్తున్న దుర్గంధం..

హకీంపేట్, విరాట్‌నగర్ కుంట తదితర ప్రాంతాల్లోని నాలాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఈ నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు కుళ్లి పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుంది. గత్యంతరం లేక నాలా పరిసరాల వారు ముక్కులు మూసుకొని కాలం వెళ్లిబుచ్చుతున్నారు. నాలాలో పూడికలు తీయడం ఉపప్రాయసంగా మారిందని పలువురు అంటున్నారు. నాలా పూడికలు కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే జరుగుతున్నాయి అనే ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. హకీంపేట్‌తో పాటు పారమౌంట్ కాలనీ వెనుక ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న బుల్కాపూర్ నాలాలో వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా పడి ఉంటున్నా పూడికతీత పనులు పత్తాలేకుండాపోతున్నాయి. స్థానికుల ఒత్తిడి మేరకు చేపడుతున్న పూడికతీత పనులు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. నాలా నుంచి తీసిన పూడికలను నాలా ఒడ్డుమీదనే వదిలేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకుంటున్నారు. వీధి జంతువులు, వాహనాల రాకపోకల కారణంగా ఈ పూడికలు మళ్లీ నాలాలోకే చేరుతున్నాయి. నాలాలు ఈగలు, దోమలు లాంటి రోగుల వ్యాపించే కీటకాలకు నిలయాలుగా మారాయి. పగలు, రాత్రి దోమలతో సావాసం చేస్తున్నామని నాలా పరిసరాల్లో ఉండే బస్తీల వాసులు వాపోతున్నారు.

కానరాని ఫెన్సింగ్..

నాలాకు వేస్తున్న ఫెన్సింగ్ జాలీ నాసిరకందే కావడంతో అది మూనాళ్ల ముచ్చటగా మారుతుంది. విరాట్‌నగర్, హకీంపేట్‌కుంట, షేక్‌పేట్ తదితర ప్రాంతాలలో నాలాకు ఇరువైపులా కేవలం పోచ్‌మాత్రమే కానవస్తున్నాయి కానీ ఫెన్సింగ్ గాయబ్ అయింది. విరాట్‌నగర్ కుంటలో గుర్తు తెలియని వ్యక్తులు ఫెన్సింగ్‌ను తొలగించి చుట్ట చేసి నాలా పక్కన వదిలేశారు. ఈ విధంగా ఫెన్సింగ్ తొలగించడం వల్ల నాలాలో చెత్త వ్యర్థాలు సులుగా వేయవచ్చు. సంవత్సరంలో కనీసం ఒకసారి కూడా అధికారులు నాలాల వైపు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోగాల బారినపడుతున్నాం..



నాలాల పరిసరాల్లో ఉండే వారు దుర్గంధంతో సావాసం చేస్తున్నారు. ఒక వైపు దుర్గంధం మరో వైపు దోమల విజృంభనతో రోగాల బారిన పడుతున్నాం. కనీసం సంవత్సరానికి రెండు సార్లు నాలాల్లో వ్యర్థాలను తొలగించాలి. నాలాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ముందుకు సాగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి. – జనార్దన్, అక్బర్‌పురా

అధికారులు నిర్లక్ష్యం వీడాలి..



అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాలాల నిర్వహణ అధ్వానంగా మారింది. నాలాలకు ఫెన్సింగ్ వేయడంలో కూడా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షకాలంలో నాలాలు పొంగిపోర్లడం ప్రతి యేటా జరుగుతుంది. వర్షకాలంలో నాలా మురికి బాధితుల సంఖ్య ప్రతి యేటా పెరుగుతూ వస్తుంది. నాలాలకు అవసరమైన చోట స్లాబ్‌లు వేసి నాలా నీరు పొంగిపోర్లకుండా చూడాలి. – ఎం.ఏ.బేగ్, సమతా కాలనీ

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కార్యక్రమంలో దక్షిణామూర్తి తదితరులు

గోల్కొండ: తెలుగుకంటే తియ్యటి, చక్కని భాషా మరొకటి లేదని ప్రముఖ రచయిత, వాఖ్యాత మడిపల్లి దక్షిణామూర్తి అన్నారు. సోమవారం మెహిదీపట్నం సంతోష్‌నగర్ కాలనీలోని సెయింట్‌ఆన్స్ మహిళా కళాశాలలో తెలుగు విభాగం వారు తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు వెంకటరామ మూర్తి, కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా కళాశాల తెలుగు విభాగం వారు నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన భాష మన సంస్కృతికి పట్టుకొమ్మలాంటిదని దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళాశాల తెలుగు విభాగాధిపతి విష్ణుప్రియ మాట్లాడుతూ..వ్యవహార భాషా ఉద్యమకారులైన గిడుగు రామమూర్తి, ప్రజాగొంతుక కవి అయిన కాళోజీ మాటల్లో తెలుగుతనం ఉట్టిపడుతున్నారు. ఈ సందర్భంగా తెలుగు విభాగానికి చెందిన విద్యార్థినులు చక్కటి పాటలు, పద్యాలు పాడి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అల్లం విజయరాణి, డీన్ డాక్టర్ అనురాధా, డాక్టర్ ఉషశ్రీ పాల్గొన్నారు.


కాంగ్రెస్ పాలనలో దేశంలో అగ్రగామిగా తెలంగాణ



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కాంగ్రెస్ నాయకులు కృష్ణ తదితరులు

గోల్కొండ: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా రూపుదిద్దుకుంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుల బృందం ఆయనను కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో కాంగ్రెస్ హయాంలోనే నగరానికి తాగునీటి ఎద్దడి తీరిందని ఈసారి కూడా సీఎం రేవంత్‌రెడ్డి జంట నగరాలకు సరిపడా తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని పేద, బడుగు వర్గాల ప్రజలతో పాటు మైనార్టీ, బీసీలు, దళితుల పక్షాన ఉండే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్‌నాయకులు కురాకుల కృష్ణ, వినోద్‌సింగ్, షకీలా తదితరులున్నారు.

కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డు



కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

అబిడ్స్: విద్య, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలు చేస్తున్న డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డు–2025కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజీనారాయణ ముదిరాజ్ తెలిపారు. 25ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఓజోన్‌పొర పరిరక్షణ వంటి రంగాల్లో దేశవ్యాప్తంగా ప్రజలను, విద్యార్థులను, యువతను చైతన్య పరుస్తున్న కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఈ అవార్డు అందజేసి ఘనంగా సత్కరిస్తామని వివరించారు. మాజీ గ్రీన్ అంబాసిడర్ ఆఫ్ తెలంగాణగా, జాతీయ పర్యావరణ పరిరక్షణ సలహాదారులుగా, లోటస్ ల్యాప్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల చైర్మన్‌గా ఆయన సమాజానికి చేసిన సేవలను గుర్తించి ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం నుంచి ఆయన ఒక్కరికే ఈ అవార్డు అందజేస్తున్నట్లు రాజీనారాయణ ముదిరాజ్ తెలిపారు. సెప్టెంబర్ 16న ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆయనకు అవార్డుతో సత్కరిస్తామన్నారు.

తెలంగాణ ధిక్కార స్వరం కాళోజీ



మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ధిక్కార స్వరం ప్రజా కవి కాళోజీ నారాయణరావు అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం, గోల్కొండ సాహితీ కళా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి ఎస్.బాలాచారి, రామకష్ణ చంద్రమౌళి, బడేసాబ్, డాక్టర్ రాధాకుసుమ, గంట మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు వేగవంతం

అబిడ్స్: గణేష్ నిమజ్జనంతో రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జీహెచ్ఎంసీ–14వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకట రమణ, డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్ పర్యవేక్షించారు. బషీర్‌బాగ్, జీహెచ్ఎంసీ కార్యాలయం, నిజాం కళాశాల పరిసర ప్రాంతాలు, ఇతర ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో వందల కొద్ది లారీల చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ..సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన నిమజ్జనం చెత్తను తొలగిస్తున్నట్లు వివరించారు. ప్రతి ప్రాంతం పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.



బషీర్‌బాగ్‌లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

అనిమేస్టడీస్‌తో కియోటో సేకా వర్సిటీ పరస్పర ఒప్పందం

నాంపల్లి: మల్టీమీడియా గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు భారతదేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఏఐసీజీ మల్టీ మీడియా కళాశాల, జపాన్‌లోని మంగ అండ్ అనిమేస్టడీస్‌లో ప్రపంచంలోనే మొదటి అగ్రగామి విశ్వవిద్యాలయమైన కియోటో సేకా యూనివర్సిటీతో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకోబోతోంది. ఈ ఒప్పందం ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు సమయంలో హైదరాబాద్‌లోని టీహబ్‌లో ఈ నెల 10న జరుగుతుంది. ఈ అవగాహన ఒప్పందాన్ని ఐఏసీజీ వ్యవస్థాపకుడు రామకృష్ణ, కియోటో సేకా యూనివర్సిటీ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ కాంటెంపరరీ ఆఫ్రికన్ అండ్ ఏషియన్ కల్చర్స్ డైరెక్టర్ షిన్ మత్సుమురా పరస్పరం మార్పిడి చేసుకుంటారు. ఈ విషయాన్ని ఐఏసీజీ సీఈఓ డాక్టర్ సురేష్ మదిరాజు, ఐఏసీజీ అకాడెమిక్స్ హెడ్ చైతన్య రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ అవగాహన ఒప్పందంతో భారత్–జపాన్ మధ్య విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

లంగర్‌హౌస్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతు మృతిచెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..రాజేంద్రనగర్ మండలం పీఅండ్‌టీ కాలనీకి చెందిన షేక్ జునీద్(22) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 6న అర్ధరాత్రి తన బైక్‌పై మెహిదీపట్నం నుంచి తన నివాసానికి వస్తున్నాడు. లంగర్‌హౌస్ పీ ఇంద్రారెడ్డి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభం వద్ద మిలటరీ ఆస్పత్రి ముందు తన వాహనాన్ని నిలిపాడు. అటు వైపు ఉన్న హోటల్‌కి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని కాలు విరిగి, తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రితో చికిత్స పొందుతూ జునీద్ సోమవారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజేందర్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

జియాగూడ: బీజేపీ గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా దివంగత రాజేందర్ డెగాన్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ శివకుమార్ యాదవ్, జియాగూడ అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, సీనియర్ నాయకులు మహేష్కర్ కాంతిలాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం వాల్మీకినగర్‌లో ఇటీవల హఠస్మరణ చెందిన రాజేందర్ డేగన్ చిత్రపటానికి పలువరు బీజేపీ నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిషన్ మోర్చా కార్యదర్శి దేవర శ్రీనివాస్, సీనియర్ నాయకులు కిషన్ దామ, వినయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన అక్రమ నిర్మాణాలపై మలక్‌పేట్ ఒకటి, చాంద్రాయణగుట్టలో రెండు, ఫలక్‌నుమాలో ఒకటి, రాజేంద్రనగర్‌లో ఒకటి చొప్పున ఫిర్యాదులు రాగా..చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా సర్కిలల్లో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సీసీ రోడ్ల నిర్మాణాలపై 2 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ మురుగునీటి సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, జోనల్ ఏఎంసీ రాజారావు, మలేరియా ఎస్ఈ నామాల శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మాజీద్ పాల్గొన్నారు.

నవ సమాజ స్థాపన ఉపాధ్యాయులతోనే సాధ్యం



జైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న జియాగూడ కేటీఎస్ సిబ్బంది

జియాగూడ: నవ సమాజ స్థాపన ఉపాధ్యాయులతోనే సాధ్యమని కేటీఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జియాగూడ కృష్ణవేణి హై స్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నాగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన టీచర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జైపాల్‌రెడ్డిని స్కూల్ యాజమన్యం సన్మానించారు.ఆయన మాట్లాడుతూ..దేశానికి రైతు ఎంత ముఖ్యమో యువతకు ఉపాధ్యాయుడి మార్గదర్శం అంతే ముఖ్యమన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, టీచర్ల వేషధారణలో ఉన్న విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ బాలాజీ, జోనల్ మేనేజర్, జహంగీర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు జీఎస్‌టీలో రాయితీ కల్పించాలి



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

చార్మినార్: పరిశ్రమలను నడిపే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు సైతం జీఎస్‌టీలో రాయితీ కల్పించాలని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు కోరారు. బీజేపీ మహిళా మోర్చ కార్యాలయ కార్యదర్శి దీపికతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు బోసుపల్లి ప్రతాప్, శివకుమార్ తదితరుల బృందం కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సామాన్యులపై భారం మోపకుండా జీఎస్‌టీని దాదాపు తగ్గించడం సంతోషకరమైన విషయమన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు నడిపే పరిశ్రమల యజమానులకు కూడా జీఎస్టీలో రాయితీ కల్పించాలన్నారు.

హుస్సేన్‌సాగర్‌కు మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: హుస్సేన్‌సాగర్‌కు మురుగునీటి ప్రవాహం రాకుండా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొబ్బరి నీళ్లతో హుస్సేన్‌సాగర్ నింపుతామన్న ఆయన కలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలన్నారు. గణేషు నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి హుస్సేన్‌సాగర్‌కు రావడం ఎంతో అభినందనీయమన్నారు. మురుగునీటిలో దురదృష్ట వశాత్తు మనం గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నామన్నారు. హుస్సేన్‌సాగర్‌కు ఏ ప్రాంతం నుంచి అయినా మురుగునీరు రాకుండా డ్రైనేజీ వ్యవస్థను ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఇతర ప్రాంతాలకు తరలిస్తే హుస్సేన్‌సాగర్‌ను మంచినీళ్లతో నింపవచ్చని రాజాసింగ్ అన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి రాబోయే సంవత్సరంలోనైనా వినాయకుడి నిమజ్జనాన్ని మంచినీరు కలిగి ఉండే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించి పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టెక్నికల్ ఉపాధ్యాయులకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న మంత్రి వివేక్, ముఖ్య కార్యదర్శి దానకిషోర్

నాంపల్లి: రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఉపాధ్యాయ దినోత్సవం(టెక్నికల్) వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఉపాధ్యాయులను మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణా సంస్థ జాయింట్ డైరెక్టర్ నగేష్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రాజా, డిప్యూటీ డైరెక్టర్ నర్సయ్య, జాయింట్ లేబర్ కమిషనర్ గంగాధర్, ట్రైనింగ్ ఆఫీస్ ఎం.బి. కృష్ణయాదవ్, మల్లేపల్లి ప్రిన్సిపాల్ శైలజ, శాంతినగర్ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాసరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్వాన్‌లో విద్యుత్ అధికారుల పర్యటన



హకీంపేట్‌లో పర్యటిస్తున్న సీఈ ప్రభాకర్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ ఫీడర్లు, ఇతర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలిస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించారు. గత వారం ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ విద్యుత్ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లకు మరమ్మతులు తదితర విషయాలపై పరిశీలించాలని తనను కలిసి కోరారన్నారు. దానికి అనుగుణంగానే నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తున్నామన్నారు. హకీంపేట్ ఖాజాబంగ్లా ఫీడర్, నానల్‌నగర్, గోల్కొండ, కార్వాన్ తదితర ప్రాంతాల్లోని ఫీడర్లను సైతం పరిశీలిస్తామన్నారు. ఎస్ఈ వెంకన్న, డీఈలు శ్రీధర్, సుధీర్, మజ్లిస్ నాయకులు మజీద్, ముజీబ్, అబ్బాస్ తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

యాకుత్‌పురా: బహదూర్‌పురా మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం మొఘల్‌పురాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఐఓఎస్ హరినారాయణ మాట్లాడుతూ..ఉపాధ్యాయ వృత్తి ఎంతో కృలకమైందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యానందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాంచందర్, సుందరీ, మాధవీ, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ విజయ్ భాస్కర్, జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు గిరివర్ధన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఇఫ్తేకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైభవంగా అనంత పద్మనాభస్వామి వ్రతం



దీపాలు వెలిగించి వేడుకలు నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

అఫ్జల్‌గంజ్: అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం అనంత చతుర్థిని పురస్కరించుకొని ఈ వేడుకలు నిర్వహిస్తారు. గ్రేటర్ ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రకాష్ గుప్తా, రాజేష్‌గుప్తా ఆధ్వర్యంలో అనంత పద్మనాభస్వామికి దీపాలు వెలిగించి వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంత పద్మనాభస్వామి వ్రత వేడుకలు నిర్వహించడంతో మానసిక ప్రశాంతత, ఉల్లాసం, మానసిక సంతోషం కలుగుతుందన్నారు.